జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/









# విజయ్‌కు మళ్లీ గవర్నర్ మొండిచేయి..

- కలిసి వచ్చే పార్టీల వేటలో బిజీగా మారిన టీవీకే చీఫ్
- డీఎంకే, అన్నాడీఎంకే జట్టుకడితే మూకుమ్మడి
- రాజీనామాలు చేసేందుకు రెడీగా ఉన్న టీవీకే ఎమ్మెల్యేలు !
- అవసరమైతే న్యాయపోరాటానికీ సిద్ధమని వ్యాఖ్య
- నూతన ప్రభుత్వ ఏర్పాటుపై తమిళనాట కొనసాగుతున్న ప్రతిష్టంభన
- రాజ్యసభ స్థానానికి అన్నాడీఎంకే నేత షణ్ముగం రాజీనామా
- అన్నాడీఎంకేను చీల్చి టీవీకేతో షణ్ముగం కలుస్తారని ఊహాగానాలు


చెన్నై: తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టినట్లు తమ మొదటి ఎన్నికల్లోనే అత్యధిక స్థానాల్లో గెలిచి దాదాపు అధికారతీరాలకు చేరిన టీవీకే గంటలు గడుస్తున్నా ప్రభుత్వ ఏర్పాటు గండాన్ని దాటలేక అవస్థలు పడుతోంది. మ్యాజిక్ ఫిగర్ సాధించాకే తన వద్దకు రావాలని ఓవైపు గవర్నర్ అర్లేకర్ స్పష్టంచేయడం, మరోవైపు పదవీయోగం దక్కకుండా చేసేందుకు ద్రవిడ దిగ్గజ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకే కలిసి పనిచేయనున్నాయనే వార్తల నడుమ టీవీకే చీఫ్ విజయ్ వేగంగా పావులు కదుపుతున్నారు. తమ ప్రియతమ హీరో, నేతను ముఖ్యమంత్రికాకుండా అడ్డుతగిలితే మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకూ



## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి..

- స్పందించిన బండి సంజయ్
- బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం
- తమ కార్యకర్తల సహనం పరీక్షించవద్దన్న బండి సంజయ్
- దాడులు, దౌర్జన్యాలు తమ సంస్కృతి కాదన్న బండి సంజయ్

కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద జరిగిన దాడి ఘటనపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, తమ కార్యకర్తలకు కూడా సహనం ఉంటుందని, కానీ ఆ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.






# సంపద సృష్టితోనే సంక్షేమం..

- ప్రారంభమైన కలెక్టర్ల 7వ కాన్ఫరెన్స్
- గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిందన్న సీఎం
- సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న చంద్రబాబు
- ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలని అధికారులకు కీలక ఆదేశం
- రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయని వెల్లడి



## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..

- ఎల్లుండి కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం!
- పశ్చిమ బెంగాల్ శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి
- ముగిసిన ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ పదవీకాలం

# పిఠాపురం టీడీపీలో అనూహ్య పరిణామం..

- బాధ్యతల నుంచి వర్మ తొలగింపు.. మీడియా ముందు కన్నీళ్లు
- పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి మాజీ ఎమ్మెల్యే వర్మ తొలగింపు
- నియోజకవర్గ పార్టీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు అధిష్ఠానం కసరత్తు
- మీడియా సమావేశంలో భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమైన వర్మ
- కూటమిలో ఇబ్బందులు రాకుండా తానే కమిటీని కోరానని వర్మ వెల్లడి
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ



పిఠాపురం నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించింది. ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఏర్పాటుపై టీడీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పిఠాపురంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తనను ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందిస్తూ,



## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు హరీశ్ రావు ఆగ్రహం

- వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన
- నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శ
- తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ

## తమిళనాడు రాజకీయాలపై డీకే శివకుమార్ హాట్ కామెంట్స్

- తమిళనాడు గవర్నర్ తీరుపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విమర్శలు
- నటుడు విజయ్ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వకపోవడం సరికాదు
- గతంలో యడియూరప్ప, వాజ్‌పేయిలకు ఇలాగే అవకాశం ఇచ్చారని గుర్తు చేసిన డీకే
- మెజారిటీ నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికం

## ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్.. రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడి

- ఏపీకి వచ్చిన ప్రముఖ మోటార్‌సైకిల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్
- సత్యవేడులో రూ. 2,200 కోట్లతో భారీ తయారీ యూనిట్ ఏర్పాటు
- తమిళనాడు వెలుపల సంస్థ ఏర్పాటు చేస్తున్న తొలి ప్లాంట్ ఇదే
- ప్రాజెక్టు ద్వారా దాదాపు 5,000 ఉద్యోగాల కల్పన
- పెట్టుబడికి ఆమోదం తెలిపిన ఏపీ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి భారీ ఊతం లభించింది. ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం, ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన నూతన తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనుంది.






తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

# బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నేడు (మే 7) అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి అధికారికంగా ముగిసింది."భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174, క్లాజ్ 2 ప్రకారం నాకు దఖలుపడిన అధికారాలను ఉపయోగించి, పశ్చిమ బెంగాల్ శాసనసభను 2026 మే 7 నుంచి రద్దు చేస్తున్నాను" అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలను అంగీకరించని మమతా బెనర్జీ, ముఖ్యమంత్రి




పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, ఈ పరిణామంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) ట్యాంపరింగ్ ద్వారానే బీజేపీ గెలిచిందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీతో కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. బీజేపీ విజయాన్ని "అనైతికం" అని ఆమె అభివర్ణించారు.గవర్నర్ నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఎల్లుండి బీజేపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరనున్నట్టు సమాచారం.

# విజయ్‌కు మళ్లీ గవర్నర్ మొండిచేయి..

వెనుకాడబోమని టీవీకే ఎమ్మెల్యేలు ప్రతినబూనారన్న వార్త తమిళనాట సంచలనం సృష్టిస్తోంది. 24 గంటల వ్యవధిలో రెండుసార్లు ప్రత్యేకంగా కలిసి అభ్యర్?థంచినా గవర్నర్ మనసు మార్చుకోకపోవడంతో సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయపోరాటానికి సిద్ధపడేందుకు టీవీకే రెడీగా ఉందన్న వార్త చక్కర్లు కొడుతోంది. ఆలోపు భావసారూప్య పార్టీల మద్దతు కూడగట్టేందుకూ టీవీకే శతథా ప్రయత్నిస్తోంది. టీవీకే అభ్యర్థనతో మద్దతు ఇచ్చే ఆలోచన ఉన్నా బీజేపీ ఒత్తిడి కారణంగా అంతటి సాహసం చేసే దమ్ములేక అన్నాడీఎంకే మిన్నకుండిపోయిందని వార్తలు వినవస్తున్నాయి. టీవీకే కూటమిలోకి దూకేయకుండా తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఇప్పటికే అన్నాడీఎంకే రిసార్ట్ రాజకీయాలకు శ్రీకారం చుట్టింది. అటు అన్నాడీఎం కలిసిరాక, ఇటు ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు సరిపోక విజయ్ ఇతర పార్టీల అగ్రనేతలతో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తమిళనాట ఏ పార్టీ/కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందనే దానిపై తలపండిన రాజకీయ పండితులు సైతం ఎటూ తేల్చలేకపోతున్నారు.

**మరోసారి లోక్‌భవన్‌కు..**

గవర్నర్ అర్లేకర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విజయ్ గురువారం లోక్‌భవన్‌కు వెళ్లారు. తమకు అవకాశమిస్తే అసెంబ్లీ బల నిరూపణ చేసుకుంటామని గవర్నర్‌ను లిఖితపూర్వకంగా అభ్యర్?థంచారు. ఇందుకు గవర్నర్ నుంచి సానుకూల స్పందన కరువైంది. 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో వస్తేనే సాధారణ మెజార్టీ సాధించినట్లు భావించి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమిస్తానని విజయ్‌కు గవర్నర్ స్పష్టంచేశారు. తమకంటే ముందుగా మరే పార్టీ లేదా కూటమికి ప్రభుత్వ ఏర్పాటు అవకాశం ఇవ్వొద్దని విజయ్ కోరారని, అందుకు గవర్నర్ సమ్మతి తెలిపారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్‌తో విజయ్ భేటీ 40 నిమిషాల్లోపే ముగిసింది.

**అనూహ్యంగా షణ్ముగం రాజీనామా**

అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం గురువారం రాత్రి అనూహ్యంగా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేశారు. ఢిల్లీకొచ్చి సంబంధిత ఉన్నతాధికారికి తన రాజీనామా లేఖను అందజేశారు. విజయ్‌తో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకుంటే రాష్ట్రానికి క్షేమదాయకమని ఫలితాలు వెల్లడయ్యాక షణ్ముగం వ్యాఖ్యానించడం తెల్సిందే. దీంతో అన్నాడీఎంకేను చీల్చి తన వర్గం ఎమ్మెల్యేలను టీవీకేకు మద్దతు ఇచ్చేలాచేసి ప్రభుత్వ ఏర్పాటుకు షణ్ముగం ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చాయి. దీనిపై ఆయన స్పందించారు. "దీనిపై నేనేమీ మాట్లాడను. నాకేమీ తెలియదు" అని అన్నారు. డీఎంకేతో అన్నాడీఎంకే పొత్తు ప్రతిపాదనలను మొదట్నుంచీ షణ్ముగం వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. పనయూర్‌లో టీవీకే ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఇక్కడ ఏ నిర్ణయాలు తీసుకున్నారనేది తెలియరాలేదు. అందరూ ఐక్యంగా ఉండాలని విజయ్ కోరుకుంటున్నారని పార్టీ ముఖ్యనేత తెలిపారు. "పార్టీ అనేది అసెంబ్లీలో బలనిరూపణ చేసుకుంటుంది. మొత్తం ఎమ్మెల్యేల జాబితాను ముందస్తుగా అడగాల్సిన అవసరం గవర్నర్‌కు ఏముంది? ఉద్దేశపూర్వకంగా బీజేపీ గవర్నర్‌తో తమిళనాట రాజకీయ అస్థిరతను సృష్టిస్తోంది. గవర్నర్ వైఖరిపై శు క్రవారం నిరసనర్యాలీలు కొనసాగుతాయి" అని కాంగ్రెస్ తెలిపింది.

# రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు హరీశ రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు.నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

# పిఠాపురం టీడీపీలో అనూహ్య పరిణామం..




కన్నీళ్లు ఆపుకోలేక ప్రెస్ మీట్ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. అంతకుముందు వర్మ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకే పనిచేశానని, పార్టీ బలోపేతం కోసమే కృషి చేశానని, ఎన్నడూ వ్యతిరేకంగా పనిచేయలేదని అన్నారు. పిఠాపురంలో ఎన్డీయే కూటమిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే, పార్టీ వ్యవహారాల నిర్వహణకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తానే స్వయంగా మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు వర్మ సంచలన విషయం వెల్లడించారు. తాను ఒక్కడినే అన్ని పనులు చూడటం కష్టంగా ఉందని, అందుకే కమిటీ వేయమని అడిగానని, ఈ నేపథ్యంలోనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని తన అనుచరులకు వర్మ వివరించినట్లు సమాచారం. కొన్ని రాజకీయ పరిణామాల దృష్ట్యా పార్టీలో మార్పులు సహజమని, అధిష్ఠానం పార్టీ శ్రేయస్సు కోసమే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. పిఠాపురంలో పార్టీని నేతలే నడిపిస్తారని, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.మొత్తం మీద పిఠాపురం వంటి కీలక నియోజకవర్గంలో వర్మను బాధ్యతల నుంచి తప్పించడం ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏర్పాటు చేయబోయే కమిటీలో వర్మకు స్థానం కల్పిస్తారా? లేదా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# సంపద సృష్టితోనే సంక్షేమం..

సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురువారం సచివాలయంలో ప్రారంభమైంది. రాష్ట్ర పాలనలో కీలకమైన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభంలో 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కించుకున్నందుకు ముఖ్యమంత్రికి మంత్రులు, అధికారులు స్టాండింగ్ ఓవేషన్‌తో ఘనంగా అభినందనలు తెలిపారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, గ్రామ స్థాయి అధికారి నుంచి మంత్రుల వరకు అందరి సమష్టి కృషి ఫలితమని సీఎం పేర్కొన్నారు. గత పాలనలో రాష్ట్రం విధ్వంసం.. రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్వాగతోపన్యాసం చేస్తూ, రాష్ట్ర పరిపాలనపై తన దార్శనికతను, ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల నుంచి రూ.9.74 లక్షల కోట్ల అప్పులు మనకు సంక్రమించాయి. అంతేకాకుండా, 94 కేంద్ర పథకాల నుంచి సుమారు రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించింది. చెల్లించాల్సిన బిల్లులు రూ.1.30 లక్షల కోట్లు కూడా మనపైనే రుద్దారు. రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలు పడి విధ్వంసమయ్యాయి" అని చంద్రబాబు వివరించారు.సంపద సృష్టితోనే సంక్షేమం.. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలిప్రస్తుతం తమ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తోందని ఆయన అన్నారు. "సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి అనేవి ఒకదానికొకటి ముడిపడిన చక్రం లాంటివి. అభివృద్ధి లేకుండా సంపద రాదు, సంపద లేకుండా సంక్షేమం సాధ్యం కాదు. డబ్బులు లేవని కూర్చోవడం కాదు, సంపదను సృష్టించే పని చేయాలి, చేద్దాం" అని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వం విజయవంతమవుతుందని స్పష్టం చేశారు.

**జవాబుదారీతనం అత్యంత ముఖ్యం**

పరిపాలనలో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. "ప్రజల నుంచి వచ్చే ఆర్థికేతర ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాల్సిందే. కొందరు అధికారులు వాటిని పైకి కిందకు తిప్పుతున్నారు, ఈ వైఖరి మారాలి. ఆర్థికపరమైన ఫిర్యాదులపైనా విచారణ జరిపి, అర్హమైన వాటిని వెంటనే పరిష్కరించాలి. 2027 మార్చి నాటికి రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేయాలి" అని అధికారులకు గడువు విధించారు.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని సీఎం వివరించారు. "నా కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేయడం గర్వంగా భావించేవాళ్లం. అలాంటి దిగ్గజ సంస్థను ఇప్పుడు ఏపీకి తీసుకువచ్చాం. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలు మన రాష్ట్రానికి వచ్చాయి. రూ.23 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని చంద్రబాబు తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌తో పాటు డేటా, ఏఐ, క్వాంటం టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రుల సింగపూర్ పర్యటన వివరాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, విద్య-వైద్యం వంటి అంశాలపై కూడా ఈ సదస్సులో సమీక్షించనున్నారు.

# ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఇక 24 గంటల్లోనే..

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం 24 గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది. ఈ మేరకు రవాణా శాఖ రూపొందించిన కొత్త విధానానికి ఈ వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వాహనాల రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రవాణా శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 వేల వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త విధానం ప్రకారం డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఆమోదించాలి. ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారికి ఈ నిబంధన వర్తించదు. ఒకవేళ అధికారులు గడువులోగా ఆమోదం తెలపడంలో విఫలమైతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. సెలవు రోజుల్లో కూడా అధికారులు ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. తొలుత శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని డీలర్లకే అప్పగించాలని సీఎం సూచించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రావొచ్చని అధికారులు వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్ అధికారాన్ని రవాణా శాఖ వద్దే ఉంచి, 24 గంటల కాలపరిమితితో కూడిన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ దస్త్రం ప్రభుత్వ ఆమోదం పొందగానే కొత్త విధానం అమల్లోకి రానుంది.

# కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని అన్నారు. దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం తమ సంస్కృతి కాదని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు తమ సహనాన్ని పరీక్షించవద్దని బండి సంజయ్ అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల నీతి వ్యాఖ్యలు చూస్తుంటే నవ్వొస్తుందని అన్నారు. పదేళ్లలో ఆ పార్టీ చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పాలన రజాకార్లను తలపించిందని ఆరోపించారు. దాడుల సంస్కృతిని ఆ పార్టీయే ఆరంభించిందని విమర్శించారు. గతంలో తాను చేపట్టిన ప్రజాసంగ్రామయాత్రను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నో ఇబ్బందులు సృష్టించాయని అన్నారు. నాడు పదుల సంఖ్యలో కార్లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. మహిళా కార్యకర్తలపై కూడా దాడులు చేశారని ధ్వజమెత్తారు. గతంలో చేసిన దాడులను మరిచిపోయి ఇప్పుడు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

# ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్.. రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

1901లో సంస్థ ప్రారంభమైన నాటి నుంచి తమిళనాడు వెలుపల ఇంత భారీ స్థాయిలో విస్తరించడం ఇదే తొలిసారి కావడం విశేషం.తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కంపెనీ రెండు దశల్లో సుమారు రూ. 2,200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. ఈ ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు (233.76 ఎకరాలు), రాళ్ళకుప్పం (42.38 ఎకరాలు) గ్రామాల్లో ప్రభుత్వం మొత్తం 267 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు, ఒక ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల సంస్థకు చెందిన సరఫరాదారులు కూడా ఏపీకి

తరలివచ్చి, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆటోమోటివ్ తయారీ క్లస్టర్ ఏర్పడటానికి దోహదపడుతుంది. మొదటి దశ 2029 నాటికి, రెండో దశ 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ పరిణామంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక మోటార్‌సైకిల్ బ్రాండ్ కాదు, అది వారసత్వం, నాణ్యతకు ఒక ప్రతీక. ఇంతటి ఐకానిక్ కంపెనీని ఏపీకి స్వాగతిస్తున్నందుకు గర్వంగా ఉంది. వ్యాపార నిర్వహణలో ఏపీ వేగం, ఇక్కడి మౌలిక సదుపాయాలకు ఈ పెట్టుబడి నిదర్శనం. ఈ ప్లాంట్‌తో పాటుగా వచ్చే అనుబంధ పరిశ్రమలతో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఆటోమొబైల్, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న మా లక్ష్యం మరింత బలపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది.

# తమిళనాడు రాజకీయాలపై డీకే శివకుమార్ హాట్ కామెంట్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల తీర్పును, మనోభావాలను గౌరవించాలని గవర్నర్‌కు సూచన నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం నిరాకరిస్తూ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీసుకున్న నిర్ణయంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. గవర్నర్ చర్య పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. గురువారం బెంగళూరులోని విధాన సౌధలో విలేకరులతో మాట్లాడుతూ, సంఖ్యాబలం ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించి, మెజారిటీ నిరూపించుకోకుండా అడ్డుకునే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేశారు. "ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను అడ్డుకునే అధికారం తమిళనాడు గవర్నర్‌కు ఏమాత్రం లేదు. ఆయన ప్రవర్తన సరైనది కాదు" అని డీకే శివకుమార్ అన్నారు.గతంలో కర్ణాటక, జాతీయ స్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలను ఆయన గుర్తుచేశారు.

# దాహార్తి తీరుస్తున్న 'చలివేంద్రం'

## - రాజాపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు



**తొలివెలుగు, రాజాపేట:** రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాజాపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది వేసవి తాపం ముందుగానే మొదలై భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి పహాణీలు, పాస్‌బుక్‌లు, ఇతర ధ్రువీకరణ పత్రాల నిమిత్తం సుదూర గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది రైతులు, సామాన్య ప్రజలు వస్తుంటారు. తీవ్రమైన ఎండల కారణంగా వారు పడుతున్న ఇబ్బందులను గమనించిన తహసీల్దార్ వల్లపు ప్రదీప్.. కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా చల్లటి మంచినీటి కేంద్రాన్ని (చలివేంద్రం) అందుబాటులోకి తెచ్చారు. కార్యాలయానికి వచ్చే వారు గుక్కెడు నీళ్లు తాగి సేదదీరేందుకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారుల పనుల కోసం వచ్చి గంటల తరబడి వేచి ఉండే రైతులకు ఈ చలివేంద్రం ఎంతో ఊరటనిస్తోంది. ప్రజల కష్టాన్ని గుర్తించి సకాలంలో స్పందించిన తహసీల్దార్ ప్రదీప్‌ను మండల ప్రజలు, రైతులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కుర్మ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షాతిరేకాలు

## రాజపేటలో ముఖ్యమంత్రి, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



**తొలివెలుగు, రాజపేట:** రాష్ట్ర ప్రభుత్వం కుర్మ కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల మండల కేంద్రంలో కుర్మ సంఘం నేతలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యల చిత్రపటాలకు పాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. కుర్మల సామాజిక, ఆర్థికాభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దశాబ్దాల నాటి కల సాకారం చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, రాజపేట ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, యమ్మ నాగరాజు, డాక్టర్ చింతల రవి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, రేగు సిద్ధులు, పారుపల్లి మాజీ సర్పంచ్ గౌర బక్కయ్య, రేగు శ్రీశైలం, పుల్లంగారి పోచయ్య, నర్సింలు వెంకటయ్య, పాండవుల బసవరాజ్ పాల్గొన్నారు.

# తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

## ఆస్పత్రిలో పరామర్శించిన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



**తొలివెలుగు, రాజాపేట:** ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన ఓ కల్లుగీత కార్మికుడిని భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గురువారం పరామర్శించారు. రాజపేట మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బూడిద యాదగిరి గౌడ్ వృత్తిరీత్యా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నాగోల్‌లోని సుప్రజ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బూర నర్సయ్య గౌడ్ ఆస్పత్రికి వెళ్లి యాదగిరి గౌడ్‌ను పరామర్శించి, ఆరోగ్యం గురించి ఆరా తీశారు. అనంతరం అక్కడి వైద్యులతో మాట్లాడి, బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని, త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. బాధితుడి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# రామలింగం ఆత్మకు శాంతి చేకూరాలి..

## దశదినకర్మలో నివాళులర్పించిన మొగుదాల రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త తిరందాస్ జగన్నాథం తండ్రి తిరందాసు రామలింగం దశదినకర్మ కార్యక్రమం గురువారం పట్టణంలోని బి.ఆర్.కె కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మొగుదాల రమేష్ గౌడ్ పాల్గొని, రామలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రామలింగం మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, యువజన కాంగ్రెస్ నాయకులు కంచరకుంట్ల రాంరెడ్డి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.








# అన్నదాతను ఆదుకోవాలి.. తక్షణమే పరిహారం చెల్లించాలి

- కాంగ్రెస్ పాలనలో రైతుల మరణాలు ఆందోళనకరం
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ గొంగిడి సునీత డిమాండ్
- రాజపేట మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

**తొలివెలుగు, రాజపేట:** ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్ల వానల ధాటికి పంటలు నష్టపోయి తీవ్ర ఆవేదనలో ఉన్న రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆమె రాజపేట మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి దెబ్బతిన్న వరి, మామిడి పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. రాజపేట మండల పరిధిలోని సింగారం, జాల, బూరుగుపల్లి, కుర్రారం, బొందుగుల నర్సాపూర్ తదితర గ్రామాల్లో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుర్రారం గ్రామంలో రైతు వెంటపర్తి రాజిరెడ్డికి చెందిన మామిడి తోటను ఆమె స్వయంగా పరిశీలించారు. నేలరాలిన కాయలను చూసి విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని సునీత అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కల్లాల వద్దకు వెళ్తున్న రైతులు గుండెపోటుతో మరణిస్తున్నారని, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆమె విమర్శించారు. కేసీఆర్ హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఇస్తామని డిమాండ్ చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక అసలు రైతుబంధునే ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాల్లో రైతులను బెదిరింపులకు గురిచేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, నదీ జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవాలు

- వేడుకగా ఆకు పూజ, హోమాలు
- నేడు యంత్ర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ





**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ధ్వజస్తంభ, సూర్యనారాయణ మూర్తి, సంతాన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే విశేష పూజలు నిర్వహించారు. పెరికకుల సంఘం ఆధ్వర్యంలో చలివేదుల రాజేశ్వర శర్మ జోషి, మల్లికార్జున శర్మ బృందం వేద మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉదయం గురువందనం, స్వామివారికి ఆకు పూజ, దేవతా పూజలు, ప్రతిష్ఠా హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. మధ్యాహ్నం ధాన్యాధివాసం, సాయంత్రం ఫల పుష్పాధివాసం, శయ్యాధివాసం తదితర క్రతువులను నిర్వహించారు. అనంతరం నీరాజనం, మంత్రపుష్పం అందజేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. చివరి రోజైన శుక్రవారం యంత్ర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణతో ఉత్సవాలు ముగియనున్నట్లు అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బేడిద నర్సింలు, మాజీ అధ్యక్షులు సోమసాని రాజమల్లయ్య, జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ దంపతులు, కుల సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- సాదాబైనామా, భూభారతి ప్రక్రియపై ప్రత్యేక దృష్టి
- ధాన్యం తరలింపులో జాప్యం వద్దు: అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి





**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. సాదాబైనామా దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని ఆదేశించారు. తూకం పూర్తయిన బస్తాలను వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీఓలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

## సర్పంచ్ రాంజీ నాయక్ సూచన.. మజ్జిగ పంపిణీ

**తొలివెలుగు, రాజపేట:** ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పుట్టగూడెం తండా సర్పంచ్ రాంజీ నాయక్ సూచించారు. గురువారం తండాలో పనులు నిర్వహిస్తున్న కూలీలను ఆయన పరామర్శించి, వారికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలన్నారు. మంచి నీటిని ఒకేసారి కాకుండా విరామం ఇస్తూ ఎక్కువ మొత్తంలో సేవించాలని, ఆశా కార్యకర్తలు అందజేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను వృధా చేయకుండా నీటిలో కలుపుకొని తాగాలని కోరారు. పనుల సమయంలో ఎవరికైనా గాయాలైతే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, వార్డు సభ్యులు విజయ, విఠల్ నాయక్, చందు నాయక్ మరియు కూలీలు పాల్గొన్నారు.



# గడప గడపకూ పంచాయతీ పాలకవర్గం



- రేనికుంటలో 27 అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- సమస్యల అడిగి తెలుసుకున్న సర్పంచ్, కార్యదర్శి

**తొలివెలుగు, రాజపేట:** మండలంలోని రేనికుంట గ్రామ పంచాయతీ పాలకవర్గం గురువారం 'ప్రజల వద్దకే పాలకవర్గం' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. సర్పంచ్ కర్రీ వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామస్తుల జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాల లభ్యతపై 27 అంశాలతో కూడిన ప్రశ్నావళి ద్వారా వివరాలు సేకరించారు. త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, తడి - పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నుల చెల్లింపుల గురించి అవగాహన కల్పించారు. వీటితో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న పింఛన్లు, గ్రామంలో నాటడానికి అవసరమైన మొక్కల రకాల గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్లా హర్షవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## మోడల్ సిటీగా భువనగిరి.. సుందరీకరణకు ప్రత్యేక నిధులు






- పేదలందరికీ సొంతింటి కల నిజం చేస్తాం..
- త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల గృహప్రవేశాలు
- కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక.. శుభాకాంక్షల వెల్లువ
- మూసీపై రూ.50 కోట్లతో వంతెన మంజూరు: ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** భువనగిరి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భువనగిరి పరిధిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు తుది దశకు చేరుకున్నాయని, ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళనలో భాగంగా నదిపై రూ.50 కోట్ల వ్యయంతో వంతెన మంజూరైందని తెలిపారు. జూలూరు, అనాజీపురం, శివారెడ్డిగూడెం ప్రాంతాల్లో వంతెనల నిర్మాణాలను ప్రజాపాలనలో భాగంగా ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కొండగట్టుకు నర్సాపురం భక్తుల పాదయాత్ర
### ఇరుముడి కట్టుకుని బయలుదేరిన స్వాములు



**తొలివెలుగు, రాజపేట:** మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారులు గురువారం కొండగట్టు అంజన్న దర్శనానికి పాదయాత్రగా బయలుదేరారు. గ్రామానికి చెందిన భక్తులు గణేష్, ప్రశాంత్ హనుమాన్ దీక్షలో భాగంగా ఇరుముడి కట్టుకుని కాలినడకన క్షేత్రానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామివారిపై ఉన్న భక్తితో ఏటా పాదయాత్ర చేపడుతున్నామని, లోక కల్యాణం కోసమే ఈ యాత్ర అని తెలిపారు. మార్గమధ్యలో వివిధ ఆలయాలను దర్శించుకుంటూ కొండగట్టు చేరుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, భక్తులు పాల్గొని స్వాములకు వీడ్కోలు పలికారు.

## అన్నదాతలే విద్యుత్తు ప్రదాతలు కావాలి

- సోలార్ ప్యానెళ్లతో రైతులకు అదనపు ఆదాయం
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రైతు సాధికారతకు పెద్దపీట వేస్తున్నట్లు చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదికలో నిర్వహించిన 'రైతు వారం' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. 99 రోజుల కార్యాచరణలో భాగంగా వ్యవసాయం, ఇంధన శాఖల సమన్వయంతో సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు తమ పొలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా 'అన్నదాత' స్థాయి నుంచి 'విద్యుత్తు ప్రదాత'గా ఎదగవచ్చని ఆమె ఆకాంక్షించారు. సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయిన అదనపు విద్యుత్తును డిస్కమ్‌లకు విక్రయించి స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అంజయ్య గౌడ్, ఏవో నాగరాజు, కౌన్సిలర్లు రాకేష్ రెడ్డి, చిరంజీవి, విద్యుత్ శాఖ అధికారులు సీఈ, డీఈ, ఏఈలు, రైతులు పాల్గొన్నారు.

## బాలికల సాధికారతే లక్ష్యం.. 'స్నేహ' శిబిరాలను జయప్రదం చేయాలి

- అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమ అమలు
- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం





**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలోని కిశోర బాలికల భద్రత, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా చేపడుతున్న "స్నేహ – సమ్మర్ హాలిడేస్ క్యాంప్"ను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో గ్రామీణ ప్రాంత బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారిని సాధికారత దిశగా నడిపేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా బాలికల పోషణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లల నడవడికలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, వారు క్రమశిక్షణతో ఉంటేనే పిల్లలు కూడా సన్మార్గంలో నడుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ, వైద్య, విద్యా, పోలీస్ శాఖలు పరస్పరం సహకరించుకోవాలని తెలిపారు. డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ క్యాంపుల ద్వారా బాల్య వివాహాల నివారణ, జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, యోగా మరియు క్రీడలపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, డీఎంహెచ్ఓ మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఈఓ సత్యనారాయణ, క్రీడల అధికారి ధనాంజనేయులు, ఏపీఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పోన్నగాని జహంగీర్ గౌడ్ ని పరామర్శించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం రోజు మండల కేంద్రంలో వార్త విలేకరి జహంగీర్ తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి.వీరివెంటా బిఆర్ఎస్ మండల నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి, కరుణాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాం

- గౌరవప్రదమైన జీవనానికి ఇందిరమ్మ ఇళ్లే నిదర్శనం
- చౌటుప్పల్‌లో నూతన గృహాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు ఆత్మగౌరవాన్ని ప్రసాదిస్తోందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో అన్నమోని పాండు – సుశీల దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాగా, గృహ యజమానుల కుమారుడు శివాజీ.. చైర్‌పర్సన్ దంపతులను సన్మానించేందుకు బదులుగా, ఆ ఖర్చుతో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ వినూత్న నిర్ణయాన్ని చైర్‌పర్సన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్ పిల్లలమరి మధుసూదన్, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తోర్పునూరి నరసింహ గౌడ్, యువజన కాంగ్రెస్ నేతలు చింతకింది గణేష్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో మదర్ థెరిసా విద్యార్థుల విజయభేరి

- పాఠశాలకు వంద శాతం ఉత్తీర్ణత
- విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలివెలుగు, రామన్నపేట/నకిరేకల్:** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో స్థానిక మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటారు. ఈ సందర్భంగా పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. 576 మార్కులు సాధించిన ఎన్. ప్రసన్న, 569 మార్కులు సాధించిన పి. విష్ణువర్ధన్‌లను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించాలని, క్రమశిక్షణతో చదివి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జె.ఎస్. మార్టిన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు ఘన స్వాగతం

మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, సర్పంచ్ విక్రమ్



**తొలివెలుగు, రామన్నపేట/చిట్యాల:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్‌రావుకు చిట్యాల మండలంలో ఘన స్వాగతం లభించింది. కోదాడ పర్యటన ముగించుకుని గురువారం సాయంత్రం రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు వెళ్తున్న ఆయనకు పెద్దకాపర్తి వద్ద పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక అంశాలపై హరీష్‌రావు వారితో కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకన్న గుట్టలో వైభవంగా 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు





### మే 8 నుంచి 12 వరకు ఘనంగా ఉత్సవాలు

**తొలివెలుగు, గండిపేట్ :** అత్తాపూర్ సర్కిల్ మైలార్దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వెంకన్న గుట్ట, టి.ఎన్.జి.ఓస్ కాలనీ, పద్మశాలిపురం, కాటేదాన్‌లో ఉన్న శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలాగ్రామ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి వారి మంగళాశాసనములతో మే 8 నుండి మే 12 వరకు ఈ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆరాధన, సేవాకాలం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, నిత్యావహనం, నివేదన శాత్తుమొరై వంటి విశిష్ట వైదిక కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు. మే 9న లక్ష్మీనారాయణీష్టి, ఎదుర్కోలు, స్వామివారి కళ్యాణ మహోత్సవం, పల్లకి సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదే రోజు రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. మే 10న వసంతోత్సవం, విష్ణుసహస్రనామ పారాయణం, మహాదాశీర్వచనం, సదస్యం కార్యక్రమాలు జరగను న్నాయి. మే 11న చక్రతీర్థం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే మే 12న హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పంచా మృతాభిషేకం, విశేష అర్చనలు, తమల పాకులతో అర్చనలు, 108 అరటిపండ్లతో ప్రత్యేక పూజలు, అప్పులమాల, వడమాలతో మహాపూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను సేవించి శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలాగ్రామ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని దేవస్థాన అర్చకులు శ్రీమన్నారాయణ చార్యులు దేవాలయ కమిటీ సభ్యులు కోరారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## వడ్ల కుప్పల వద్ద రైతు గోస.. సర్కారులో లేదు కనీస చలనం!

- నేను ఏసీ రూమ్ లో లేను.. రైతుల మధ్య ఉన్నా - తరుగు పెడితే తోలు తీస్తా అన్నోళ్లు ఎటు పోయారు?
- అన్నదాతల కన్నీళ్లు తుడిచేవారే లేరు: హరీశ్ రావు - ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం: హరీశ్ రావు
- చౌటుప్పల్ మార్కెట్‌ను సందర్శించిన మాజీ మంత్రి





**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు కల్లాల వద్దే ప్రాణాలు వదులుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆయన, ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం, తరుగు పేరుతో మిల్లర్లు దోచుకోవడంపై రైతులు ఆయన వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న బాధలు కనిపిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని మండిపడ్డారు. జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'ఏసీ గదుల్లో కూర్చుని' అంతా సజావుగా ఉందని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. మాయిశ్చర్ పరీక్షకు పది రోజులు, గన్నీ బ్యాగులకు వారం, కాంటా పెట్టడానికి మరో వారం పడుతోందని.. ఈ జాప్యం వల్ల అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సునాయాసంగా కొనుగోలు చేశామని, ఇప్పుడు కనీస వసతులు కల్పించలేక ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. వెంటనే లారీలు, గన్నీ బ్యాగులు పంపి యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## కేటీఆర్ తన భాషను మార్చుకోవాలి

- రాహుల్, రేవంత్‌రెడ్డిలకు క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర డిమాండ్



**తొలివెలుగు, రామన్నపేట/హైదరాబాద్:**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వాడుతున్న భాష అత్యంత దారుణంగా ఉందని, ఆయన తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. గత పదేళ్ల కాలంలో అబద్ధాలతో రాష్ట్రాన్ని ఏలిన కేసీఆర్, ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు నేడు శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. కేటీఆర్ మైకంలో ఉండి మాట్లాడుతున్నట్లు కనిపిస్తోందని, ఆయన భాషను చూసి రాష్ట్ర యువత చెడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తాము ప్రభుత్వంలో ఉన్నందున బాధ్యతగా మాట్లాడుతున్నామని, అదే తాము నోరు తెరిస్తే కేటీఆర్ భరించలేరని వ్యాఖ్యానించారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన జిల్లా నాయకులు



**తొలివెలుగు, రామన్నపేట/హైదరాబాద్:** రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జిల్లా నాయకుడు పూస బాలకిషన్, ప్రముఖ గాయకుడు బంధారపు వెంకటేష్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, మత్స్యకారుల సంక్షేమం, క్రీడా రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారు మంత్రితో కొద్దిసేపు చర్చించారు. జిల్లాలో క్రీడల ప్రోత్సాహానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రజల అసంతృప్తిని గమనించాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య



**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య విమర్శించారు. గురువారం రామన్నపేటలోని పార్టీ కార్యాలయంలో కూరెళ్ళ నరసింహా చారి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రజాపాలన పేరుతో ప్రచారం చేసుకుంటున్న సర్కారు, క్షేత్రస్థాయిలో సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అరకొరగానే అమలు అవుతున్నాయని, మహిళలకు రూ. 2500, ఉపాధి కూలీలకు రూ. 1200 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని, లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

**తొలివెలుగు, చౌటుప్పల్ :**చౌటుప్పల్ లోని చందన స్కూల్లో నిర్వహించబడుతున్న విజ్ఞాన దర్శిని బాలమేళాలో గురువారం రిసోర్స్ పర్సన్ గీత పాల్గొని విద్యార్థులకు కాగితాలతో బొమ్మలు చేసే ఓరిగామి కళను పిల్లలకు నేర్పించారు. దీని ద్వారా పిల్లలు వృధాగా పడిపోయిన పాత న్యూస్ పేపర్లు, ఇతర పేపర్లతో అందమైన బొమ్మలను తయారు చేయడం నేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు సృజనాత్మక కళలను పెంపొందించు కోవాలన్నారు.ఈ బొమ్మలు చేయడం సరదాగా ఉండడమే కాకుండా, ఒక కొత్త కళను నేర్చుకోవడం, వారిలోని సృజనాత్మక సామర్థ్యాలను వెలికితీయడానికి తోడ్పడుతుంద న్నారు.ఈ బొమ్మలు సైన్స్ సూత్రాలు అర్థం చేసుకునే ప్రయోగాలు చేయడానికి కూడా తోడ్పడడమే వీటిలోని ప్రత్యేకతన్నారు. సైన్ సూత్రాలను బట్టి పట్టడమే కాకుండా కాగితపు బొమ్మలతో కూడా పెద్ద పెద్ద సైన్సు సూత్రాలను అలవోకగా అర్థం చేసుకుంటూ జీవితాంతం గుర్తు పెట్టుకునే విధంగా చేయడమే బాలమేళాలోని ఓరిగామి ప్రత్యేకతని వివరించారు. కరాటే, గణితం, సైన్స్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అనేక అంశాలలో కూడా పిల్లలు భాగస్వామ్యం అవుతూ, తామే స్వయంగా చేస్తూ నేర్చుకుంటున్నా రన్నారు. బాలమేళా కోఆర్డినేటర్స్ అవ్వారు గోవర్ధన్, అవ్వారు రామేశ్వరి, ప్రిన్సిపల్ టి.మల్లేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విశాల భారతి పాఠశాలలో అథ్లెటిక్స్ డే సంబరాలు








- క్రీడలతోనే శారీరక దారుఢ్యం: కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** స్థానిక విశాల భారతి హైస్కూల్‌లో గురువారం వరల్డ్ అథ్లెటిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు, నృత్య పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల మానవ శరీరానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు శారీరక దృఢత్వం కోసం ఆటల్లో రాణించాలని సూచించారు. అనంతరం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. జాతీయ గీతం యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రుబిక్ క్యూబ్ పోటీల్లో ప్రసన్నాంజనేయులు ప్రథమ, ధీక్షిత్ ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కందుల మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్, ఆంటోని, పీఈటీ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా కౌటికే విఠల్ నియామకం

**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, సేవా కార్యక్రమాల నిర్వాహకుడు కౌటికే విఠల్ ని సంస్థ గ్లోబల్ చైర్మన్ టీ.జీ. వెంకటేష్ ప్రత్యేక సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీ.జీ. వెంకటేష్ మాట్లాడుతూ...కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. వారు ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి



సంవత్సరం వెయ్యిమందికి ఉచిత అన్నదానం నిర్వహించడం, చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకాలంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేష గుర్తింపు పొందారని పేర్కొన్నా రు. ఇలాంటి సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజ పట్ల అంకితభావాన్ని గుర్తించి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా నియమిం చినట్లు తెలిపారు.. అనంతరం కౌటికే విఠల్ మాట్లాడుతూ... తనకు ఈ పదవీ బాధ్యతలు ఇచ్చిన సందర్భంగా తాను ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కీ తొడ్పాటు అందిస్తానని తెలిపారు.ఈ సభ సభకు మదుపల్లి రవి గుప్త ,అధ్యక్షత వహించాగా ఈ కార్యక్రమంలో బి ఎన్ చారీ తదితరులు పాల్గొన్నారు.